www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 7 మే 2025




నేడు డిడిఆర్‌సి సమావేశం



ప్రజాశక్తి - భీమవరం

జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సమావేశంలో జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జిల్లా అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు.

పేదలపై యుద్ధం ఆపకపోతే..
ఉద్యమం ఉధృతం..


అభివాదం చేస్తున్న నేతలు

ఇళ్ల తొలగింపు బాధితులకు పునరావాసంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ఎంతమంది పేదలకు ప్రత్యామ్నాయం చూపారో బహిరంగ చర్చకు సిద్ధమా

పేదల ఇళ్లు కూల్చడం ఆపితే ముగింపు, లేకపోతే ఈ సభ నుంచే మరో పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

శ్వేతపత్రం విడుదల చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

కలిసొచ్చే అన్ని పార్టీలూ, సంఘాలను ఐక్యం చేసి పోరాడతాం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

'ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పేదలపై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, లేనిపక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తాం. అన్యాయంగా ఇళ్లు తొలగించిన బాధితులకు పునరావాసం కల్పించడంతోపాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. పేదలపై విధ్వంసం జరుగుతున్నా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం సిగ్గుచేటు. వారు తక్షణం జోక్యం చేసుకుని పేదలపై జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలి. లేనిపక్షంలో పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. అందరికీ ప్రత్యామ్నాయం చూపాకే ఇళ్లు తొలగిస్తున్నామని రఘురామకృష్ణరాజు చెబుతున్నారు. ఎంతమందికి ప్రత్యామ్నాయం చూపించారో బహిరంగ చర్చకు రావాలి'.. ఇవీ ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల తొలగింపును నిరసిస్తూ, వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న నేతల మాటలు.

స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాల నుంచి పేదలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. ముఖ్యవక్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక గౌరవ స్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పేదల ఇళ్లు కూలుస్తామని బహిరంగంగా ప్రకటిస్తుంటే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చట్టాన్ని ఉల్లంఘించి పేదల ఇళ్లను కూల్చే అధికారులు భవిష్యత్‌లో చట్టప్రకారం శిక్షార్హులన్నారు. మగ పోలీసులే మహిళలను ఇష్టానుసారంగా లాగడం సిగ్గుచేటన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో ఉన్న నగర్‌లో ఇళ్లు కూల్చిన ఎంఎల్‌ఎ ఇప్పుడు అల్లూరి స్వగ్రామం మోగల్లులో కూడా పేదల ఇళ్లపై దౌర్జన్యానికి శ్రీకారం చుడుతున్నారని మండిపడ్డారు. కాలుష్యానికి కారణాలు ఏమిటో ముందు పరిశీలించాలన్నారు. ఇప్పటికైనా పేదల ఇళ్ల కూల్చివేతను ఆపితే ఇది ముగింపు సభ అవుతుందని, లేదంటే ఇదే ఉద్యమ ప్రారంభ సభగా మారుతుందని హెచ్చరించారు. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు ఆహ్వానం పలకగా, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ గీతాలను ఆలపించారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి దండు శ్రీనివాసరాజు, ఎంసిపిఐ(యు) జిల్లా నాయకులు రాంబాబు, సిపిఎం నేతలు పుగాకు పూర్ణ, దూసి కళ్యాణి, కె.క్రాంతిబాబు, కె.తవిటినాయుడు, శేషపు అశ్రియ్య, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చడమేనా మీ అభివృద్ధి

ఉండి నియోజకవర్గంలో ఇళ్లు కూల్చడమేనా మీ అభివృద్ధి అని పివి.రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, ఎపి బహుజన జెఎసి ఫౌండర్, ఛైర్మన్ తాళ్లూరి మధు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్ ప్రశ్నించారు. బడా బాబుల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోగలరా అని నిలదీశారు. పేదలకు అండగా ఉండాల్సిన అధికారులు ఎంఎల్‌ఎకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు సరికావని, తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో పేదలకు అండగా సిపిఎం సాగించే పోరాటంలో భాగస్వాములమవుతామని ప్రకటించారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి.. ★★★

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం



ఇళ్ల కూల్చివేతపై ఉండి ఎంఎల్‌ఎ చెప్పేవన్నీ అవాస్తవాలే అన్నారు. జిఒ 23 ప్రకారం పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. జిల్లాలో కాలుష్యానికి కారణాలు పరిశ్రమలు తప్ప పేదల ఇళ్లు కాదన్నారు. 65 చోట్ల శాంపిల్స్ తీసి పరిశ్రమల వల్లే కాలుష్యం అవుతుందని పరిశోధకులు నిర్ధారించారని, అవసరమైతే ఆ రిపోర్టులు చదవాలన్నారు. పేదల ఇళ్ల తొలగింపు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, భూస్వాములకు దోచిపెట్టడానికే తప్ప అభివృద్ధికి కాదన్నారు. ఇదొక వ్యాపారంగా ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ముందు నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న వంతెనలు నిర్మించాలన్నారు. పెద్దల చేతుల్లో ఉన్న కొబ్బరి చెట్లు పేదలకు పంచాలన్నారు. ఎఎస్‌ఆర్ నగర్‌లో 1.75 ఎకరాల్లో పేదల నివాసాలు ఉంటే సుమారు 17 ఎకరాలు బడా భూస్వాములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఉండిలో పి-4 అంతా రివర్స్‌లో ఉందని ఆరోపించారు. టిడిపి, జనసేన నాయకులు కూడా తమకు ఎటువంటి గౌరవమూ ఇవ్వట్లేదని, గుర్తించలేదని బాధపడుతున్నారని చెప్పారు.

ఐక్య పోరాటానికి కలిసి రావాలి.. ★★★

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఒకలా ఉంటే, ఉండి నియోజకవర్గంలో పాలన మరోలా ఉందని గోపాలన్ అన్నారు. ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు అభివృద్ధి పేరుతో పేదలపై యుద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడు నెలలుగా సిపిఎం పేదల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తుందని చెప్పారు. పేదలపై యుద్ధాన్ని ఆపాలని కోరారు. రెండు వారాల నుంచి ఎఎస్‌ఆర్ నగర్‌లో బాధితులు శిథిలాల మధ్యే జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి సిపిఎం భోజనశాల ఏర్పాటు చేసి బాధిత నిర్వాసితులకు భోజనం పెడుతుందన్నారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు భోజనశాలను కొనసాగిస్తామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని శిథిలాల మధ్య బాధితులు, సిపిఎం నేతలు బుధవారం ఒకరోజు నిరాహార దీక్ష చేస్తారని ప్రకటించారు. దీనికి సంఘీభావంగా అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

పేదలకు పునరావాసం కల్పించాలి.. ★★★

సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు



గోదావరి జలాలు ఏ విధంగా కలుషితమవుతున్నాయో అనేక మంది ప్రముఖులు చెబుతున్నారు. పేదలకు అండగా నిలిచిన నాయకులను తూలనాడటం అన్యాయం. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలను సిపిఐ ఖండిస్తుంది. పేదల పక్షాన ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తారా అని నిలదీశారు. ప్రాణాలు పోయినా, కేసులు బనాయించినా వెనక్కి తగ్గేది లేదు. తక్షణం పేదలకు పునరావాసం కల్పించాలి.

ప్రజాప్రతినిధి అంటే అర్థం తెలియని వాళ్లు.. ★★★

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు



ప్రజాప్రతినిధులు అంటే ఏమిటో అర్థం తెలియని వాళ్లుకూడా ఎంఎల్‌ఎ కావడం బాధాకరం. ప్రజల సొమ్మునే జీతాలుగా తీసుకుంటూ ప్రజలనే నష్టపరచడం సమంజసం కాదు. ఎంపీగా గెలిచాక ఢిల్లీలో ఉండిపోయిన రఘురామకృష్ణరాజుకు ప్రజల ఇబ్బందులు ఏం తెలుస్తాయి. ఎంఎల్‌ఎ మంచి బుద్ధితో పేద ప్రజలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి.

నిద్రమత్తులో అధికారులు.. ★★★

మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్



ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని చట్టాలు చెబుతున్నాయనే విషయం మీకు తెలీదా. రఘురామకృష్ణరాజు ఉండి నియోజకవర్గంలో టెన్ వన్ అడంగల్ ప్రకారం సర్వే చేయించి పెద్దలు, భూస్వాములు, పెత్తందారులు, సంపన్నుల చేతుల్లో ఉన్న భూముల లెక్కలు తీయగలరా. డబ్బులిచ్చి ఓట్లు కొని గెలిచానని రఘురామకృష్ణరాజు బహిరంగంగా చెబుతుంటే అధికారులు నిద్రపోతున్నారు. తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలి. పేదలకు న్యాయం చేయాలి.

పేదల ఇళ్లను కూల్చడం దారుణం.. ★★★

బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నరాజు



ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అభివృద్ధి పేరుతో కూల్చడం అత్యంత దారుణం. పేదలకు మళ్లీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటం వల్లనే సాధ్యం. రాబోయే రోజుల్లో సిపిఎం చేపట్టబోయే పోరాటాలకు మా మద్దతు ఉంటుంది.

బుల్డోజర్ రాజకీయాన్ని ఆపాలి.. ★★★

దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్



పేదలపై బుల్డోజర్ల రాజకీయాన్ని వెంటనే ఆపాలి. పేదలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతాం. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలపై దాడులు నరేంద్ర మోడీ, అమిత్‌షాలకు కన్పించవు. పేదల ఇళ్లు కూల్చేవారే కన్పిస్తారు. పేదలపై జరుగుతున్న విధ్వంసాన్ని ఆపకపోతే రఘురామకృష్ణరాజు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

తాగునీరివ్వాలని సిపిఎం ఆధ్వర్యాన ధర్నా



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండలం మల్లవరంలంక గ్రామంలో వెంటనే తాగునీరివ్వాలని కోరుతూ ఆ గ్రామస్తులు సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో పైపులైన్ పగిలిపోయి ఒకటో వార్డు నుండి నాలుగో వార్డు వరకు గత ఐదు రోజులుగా తాగునీరు అందడం లేదన్నారు. దీంతో ప్రజలకు తాగునీటితోపాటు కనీసం వాడుకోవడానికి నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంతటి సమస్య ఉన్నా, దీనికితోడు వేసవి కాలమైనా స్థానిక అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజలు గంటలు తరబడి ఆందోళన చేస్తున్నా స్థానిక అధికారులెవరూ స్పందించలేదన్నారు. సమస్యను నరసాపురం ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లినా తమ చేతుల్లో ఏమీ లేదని, మాట్లాడతామని చెప్పడంతో సమస్యను ఆర్‌డిఒ దాసి రాజు దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే ట్యాంకర్ ద్వారా తాగునీరు ఇస్తామని తెలిపారన్నారు. వేసవి సీజన్ కావడంతో ఈ నెలాఖరు వరకు తాగునీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, కమిటీ సభ్యులు కవురు శ్రీనివాసు, స్థానికులు కవురు గోపాలకృష్ణ, గుబ్బల సత్యనారాయణ, కవురు త్రిమూర్తులు, యాంద్ర హనుమంతు, దిడ్ల నరేష్, దిడ్ల సౌదామణి, కట్టా రమణ, జక్కంశెట్టి సుజాత, కవురు దుర్గాప్రసాద్, కవురు మల్లమ్మ, గంగమ్మ, కవురు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సామాజిక స్పృహ ఎక్కువ

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సామాజిక స్పృహ ఎక్కువగా ఉంటుందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో పాలకోడేరు మండలంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సామాజిక స్పృహకల్గి ఉంటారని, విపత్కర పరిస్థితులు ఎదుర్కొనే సామర్థ్యం కల్గి ఉంటారన్నారు. డిఇఒ ఇ.నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏదైనా సాధించే సామర్థ్యం ఉంటుందని, ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమమైన ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, పాలకోడేరు, భీమవరం ఎంఇఒలు నాగరాజు, శ్రీమన్నారాయణ, వేంద్ర వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, అసోసియేట్ అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కెఎస్‌సిహెచ్.సాయిరాం, కెఎస్.రామకృష్ణప్రసాద్, జి.రామకృష్ణంరాజు, సిహెచ్.కుమార్‌బాబ్జి, జివి.రామానుజరావు, జెవివి జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాదరావు, ఎన్.నరసింహయ్య, రమణరాజు, త్రిమూర్తులు, నాగబాబు, అబ్రహం, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో రుణాలపై కొనసాగిన విచారణ

పత్తా లేని బ్యాంక్ మేనేజర్, దళారీ



ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సెంట్రల్ బ్యాంకులో చేపల చెరువుల నకిలీ లీజు అగ్రిమెంట్లతో ఆయా చెరువుల యజమానులకు తెలియకుండానే సుమారు రూ.4 కోట్లు రుణం పొందిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. నరసాపురం మండలం వేములదీవి వెస్ట్ సర్దుకొడప గ్రామానికి తిరుమాని నాగరాజు, శ్రీనివాస్, వడ్డి కాసులు, పద్మావతి పేరిట సుమారు 19 ఎకరాల భూమిపై సుమారు రూ.4 కోట్ల రుణాలు దూది చంద్రశేఖర్, కె.ప్రసాద్ పొందినట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై సెంట్రల్ బ్యాంక్ విజయవాడ రీజనల్ కార్యాలయం నుండి మంగళవారం నలుగురు అధికారులు బ్యాంకుకు వచ్చి విచారణ చేపట్టారు. అప్పటికే బ్యాంక్ మేనేజర్ టి.ప్రకాశం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో బ్యాంకు అధికారలుఉ సిబ్బందిని విచారించి, పలు డాక్యుమెంట్లు పరిశీలించి వెనుదిరిగారు. సెంట్రల్ బ్యాంకులో రుణాల కుంభకోణం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. బ్యాంకర్లు దళారీల ద్వారా వెళ్తే వెంటనే రుణాలిచ్చి కమీషన్లు తీసుకుంటున్నారని, న్యాయబద్ధంగా అన్ని పత్రాలతో నేరుగా బ్యాంకుకు వెళ్తే కనీసం సమాధానం చెప్పడం లేదని పలువురు ఆరోపించారు. ఈ కేసులో రుణాలిప్పించడంలో కీలకంగా వ్యవహరించిన దళారీ కొప్పినీడి మాధవ్, బ్యాంక్ మేనేజర్‌ను సంబంధిత అధికారులు సరైన రీతిలో విచారించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. 2020లో మృతి చెందిన వ్యక్తి పేరిట 2024లో రుణం ఎలా ఇచ్చారనే అంశంపై లోతైన విచారణ జరిపితే చాలా కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొందరు మధ్యవర్తుల సమక్షంలో ఈ కేసును రాజీ చేసే ప్రయత్నాలు పెద్దఎత్తున సాగుతున్నట్లు తెలుస్తోంది.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు పాలకొల్లు పట్టణం 26వ వార్డులో బెజవాడ కోడుపై వంతెన నిర్మాణ పనులకు, 10.30 గంటలకు యలమంచిలి మండలం కొంతేరులో ఆవ మీడియం డ్రెయిన్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 11.30 గంటలకు పాలకొల్లు రూరల్ గ్రామం నాగరాజు పేటలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం భీమవరం విద్యుత్ శాఖ సర్కిల్ ఆఫీస్ రెండో అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.


ఎస్‌ఆర్‌కెఆర్‌కు అత్యధికంగా 1502 ప్లేస్‌మెంట్లు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యధికంగా 1502 ప్లేస్‌మెంట్స్ అత్యధిక ప్యాకేజీలతో సాధించారని ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ తెలిపారు. మంగళవారం కళాశాల సెమినార్ హాల్లో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్, వివిధ విభాగాల హెడ్స్‌తోను, డీన్స్‌తోను కలిసి ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాల విద్యార్థులు సాధించిన ప్లేస్‌మెంట్స్ వివరాలు వెల్లడించారు. ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులు 949 మంది 1502 ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రధానంగా సిఎస్‌ఇ విభాగంలో 405 మందికిగాను 207 మంది ఉద్యోగాలు పొందగా రూ.17.1 లక్షల నుండి రూ.3.8 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారన్నారు. అదేవిధంగా ఎఐడిఎస్ విభాగంలో 192 మందికిగాను 104 మంది, ఎఐఎంఎల్ విభాగంలో 79 మందికిగాను 40 మంది, సిఎస్‌బిఎస్ విభాగంలో 45 మందికిగాను 26 మంది, సిఎస్‌జి విభాగంలో 37 మందికిగాను 24 మంది, ఐటి విభాగంలో 137 మందికిగాను 85 మంది ఎంపికయ్యారన్నారు. ఇసిఇ విభాగంలో 173 మందికి 124 మంది, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులు 141 మందికిగాను 116 మంది, మెకానికల్ విభాగంలో 207 మందికిగాను 156 మంది, సివిల్ ఇంజినీరింగ్ నుండి 86 మందికిగాను 67 మంది ఎంపికయ్యారన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, ప్లేస్‌మెంట్ సెల్ డీన్ డాక్టర్ కెఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలకు 45 ఐటి కంపెనీలు, 34 కోర్ గ్రూప్ కంపెనీలు కళాశాలకు వచ్చి ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు 1055 మంది ఐటి సాఫ్ట్‌వేర్ విభాగానికి, 447 మంది కోర్ గ్రూపునకు ఎంపికై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

టార్గెట్ పూర్తయ్యిందని ధాన్యం కొనడం లేదు



మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి మనోహర్

గోనె సంచుల కొరత తీవ్రంగా ఉంది

ధాన్యం కొనుగోలు చేయకపోతే ప్రభుత్వానికి అప్రతిష్ట

సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఎల స్పష్టీకరణ

పశ్చిమలో లక్ష మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - భీమవరం

'ఈ ఏడాది పంట బాగా పండింది. ధాన్యాన్ని తొలుత బాగానే కొనుగోలు చేశారు. డబ్బులు కూడా 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇదంతా ధాన్యం కొనుగోలు ప్రారంభంలో పరిస్థితి. అయితే రైతులు అకాల వర్షాలతో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టార్గెట్లు పూర్తయ్యాయని ధాన్యం కొనుగోలు చేయడం కుదరదని చెప్పడం ఎంతవరకు సమంజసం. గోనె సంచుల కొరత కూడా తీవ్రంగా వేధిస్తుంది' అని జిల్లాకు చెందిన పలువురు ఎంఎల్‌ఎలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఎదుట ఏకరువు పెట్టారు. స్థానిక కలెక్టరేట్లో ధాన్యం కొనుగోలు, సమస్యలపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారుల సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను రెండు జిల్లాల జాయింట్ కలెక్టర్లు టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, పి.ధాత్రిరెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలులో ఏర్పడిన సమస్యలను రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, ఎంఎల్‌ఎలు వివరించారు. తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక మండలంలో రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు టార్గెట్ పూర్తయిందని, ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధాన్యం సొమ్ము కొంచెం ఆలస్యమైనా పర్వాలేదని, ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయాలని కోరారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఊహించని రీతిలో ధాన్యం పండిందన్నారు. టార్గెట్ పూర్తయిందని చెప్పడం సరికాదని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అదనంగా లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తమ ప్రాంతంలో 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, అయితే గోనె సంచుల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు టార్గెట్ గ్రామాలవారీ కాకుండా మండలాలవారీ తీసుకోవాలని చెప్పారు. సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలన్నారు. దీనిపై స్పందించిన మంత్రి మనోహర్ శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి సివిల్ సప్లయిస్ డిఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుసేవా కేంద్రాల ద్వారా సమీక్షించారా, జెసికి ధాన్యం కొనుగోలు నివేదికను ఎప్పుడిచ్చారు.. తనకు ఒక కాపీ ఇవ్వాలని ప్రశ్నించారు.

50 లక్షల గోనె సంచులకు లెక్కాపత్రం లేదు

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తోపాటు అధికారులు చెప్పిన ప్రతిదీ తూచ తప్పకుండా చేస్తున్నాం. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు టార్గెట్ ఇచ్చారు. ఆ విధంగానే గోనె సంచులు ఇచ్చాం. అదనంగా మరో లక్ష సంచులు ఇచ్చాం. గత సాగులో 50 లక్షల సంచులు తీసుకున్నారు. వాటికి ఇప్పటివరకు లెక్కాపత్రం లేదు. ఇప్పుడు మళ్లీ అదనంగా 30 లక్షల సంచులు కావాలంటున్నారు. ఇవ్వడానికి మేము సిద్ధమే. ఎగుమతి లేక ధాన్యం కొనడం లేదు. ఎంత ధాన్యం కొనుగోలు చేయమన్నా చేయడానికి రైస్‌మిల్లర్స్ సిద్ధంగా ఉన్నారు. అయితే ఎగుమతులు అవసరం. ఈ సీజన్లో పండించిన వెరైటీలకు డిమాండ్ తక్కువగా ఉంది. అందువల్ల వీటిని కొనుగోలు చేసేందుకు సమస్యలు ఏర్పడుతున్నాయి.

49 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

గత వైసిపి ప్రభుత్వం రైతులను కుంభకోణాలకు, రాజకీయ లబ్ధికి వినియోగించుకుందని, కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఎంతో పారదర్శకంగా పని చేస్తుందని మంత్రి మనోహర్ చెప్పారు. అధికారులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. రబీ, ఖరీఫ్‌ల్లో రాష్ట్రంలో 48.90 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రూ.11 వేల 400 కోట్లు 24 గంటల్లో రైతులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. తాము గత ప్రభుత్వం కంటే 11 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా సేకరించామన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన రూ.1574 కోట్లు తమ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 7.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. దీనికి తగ్గట్టుగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1180 కోట్లు రైతులకు జమ చేశామన్నారు. ఏలూరు జిల్లాలో 3.53 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతుల ఖాతాల్లో రూ.487 కోట్లు జమ చేశామన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మరో ఒక లక్ష మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అదనంగా కొనుగోలు చేసేందుకు అనుమతులిస్తూ నిర్ణయించామన్నారు. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్లను అందించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి డాక్టర్ మనజీర్ జిలాని సామూల్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ, ఏకాగ్రత ఉండాలి

రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ, ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

క్రమశిక్షణ, ఏకాగ్రత కలిగి ఉంటే విద్యార్థులు ప్రతిభావంతులుగా, విద్యావేత్తలుగా గుర్తింపబడతారని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఈ విద్యా సంవత్సరం పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన 64 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, 9 కళాశాలల 124 మంది విద్యార్థులకు రాజ్యసభ సభ్యులు, ఎంఎల్ఎ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదన్నారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే మరింత రాణిస్తారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలను, మెడల్స్‌ను దాతల సహకారంతో అందించామన్నారు. మెంటే పార్ధసారధి, ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, గన్నాబత్తుల శ్రీనివాస్, వబిలిశెట్టి రామకృష్ణ, గంధం శ్రీదేవి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కారుమూరు సత్యనారాయణ మూర్తి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, శానిటరీ, సచివాలయ సిబ్బందితో కలిసి పలు వీధుల్లో పర్యటించారు. డ్రెయినేజీల్లో పూడికతీయడం, ఇంటింటా చెత్త సేకరణకు వస్తున్నారా లేదా, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, శానిటరీ మేస్త్రి కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం

ప్రజాశక్తి - ఆచంట

సమాజంలో కిశోర బాలికలు పలు రకాలుగా అన్యాయానికి గురవుతున్నారని, వాటిని ఎదుర్కొనేందుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆచంట మహిళా పోలీస్ సిహెచ్.మైథిలి అన్నారు. మంగళవారం ముత్యాలమ్మ చెరువు గట్టు అంగన్వాడీ సెంటర్లో కిశోరి వికాసం కార్యక్రమంపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల్లో చైతన్యం తీసుకురావడానికి కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాజంలో కిశోరి బాలికలు పలు రకాలుగా అన్యాయానికి గురవుతున్నారని, తెలిసీ తెలియని వయసులో ప్రేమ పేరుతో మోసపోతున్నారని తెలిపారు. యుక్త వయసులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వైట్ల ఉషారాణి, మంగలక్ష్మి, ఊహ జ్యోతి, గుమ్ములూరి చిట్టి కాసులు, డి.రత్నకుమారి, దివ్య పాల్గొన్నారు.

పెనుమంట్ర : కిశోర బాలికలు నెలసరి సమయాల్లో వ్యక్తి గత పరిశుభ్రత విషయంలో రాజీ పడొద్దని ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి సూచించారు. మంగళవారం కిశోర బాలికల వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మల్లిపూడి, వెలగలవారి పాలెం జరిగిన అవగాహనా సమావేశాల్లో పాల్గొన్నారు. చిమ్మిలి, వేరుశెనగ ఉండలు, నువ్వుల నూనెతో వండిన ఆహారం కిశోర బాలికలు ప్రతిరోజూ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిశోర బాలికలతో పాటు అంగన్వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షులుగా సందీప్

ప్రజాశక్తి - కాళ్ల


నియామక పత్రాన్ని అందుకుంటున్న గాతల సందీప్

ఉండి నియోజకవర్గ పరిధిలోని అఖిల భారత మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షులుగా గాతల సందీప్ మంగళవారం ఎంపికయ్యారు. ఈ మేరకు అఖిల భారత మానవ హక్కుల ఫౌండర్ అండ్ ఛైర్మన్ డాక్టర్ సురేష్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. సందీప్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. మంగళవారం జువ్వలపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమపై నమ్మకంతో అఖిల భారత మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్, డాక్టర్ పి.లోమిన, స్టేట్ ప్రెసిడెంట్ శ్యామలమ్మ, జిల్లా ప్రెసిడెంట్ ఎం.యాకోబు, జయ కుమార్ సందీప్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వేసవి నేపథ్యంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ప్రాంతీయ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరాజు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కమ్ముల సుబ్బారాయుడు, సభ్యులు పి.శ్రీధర్, పివి.సూర్యనారాయణరాజు, ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మొగల్తూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని శ్రీనివాస్ హాస్పటల్ వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించినట్లు హాస్పటల్ వైద్యులు సిహెచ్.శ్రీనివాస్‌రాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాజవల్లి రాధా రామణ్ లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది ఈ శిబిరానికి వచ్చిన సుమారు 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. వారికి పాలకొల్లులోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తామన్నారు. అనంతరం మందులు అందజేశారు.

ప్రతిభకు పదును పెడితే రాణింపు

ప్రజాశక్తి - తణుకు

విద్యార్థుల్లోని నిమిడీకృతమైన ప్రతిభకు సరైన పదును పెడితే వారు గొప్పగా రాణిస్తారని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.దక్షిణామూర్తి అన్నారు. స్థానిక అమరవీరుల భవనంలో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం, తణుకు బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో గతవారం రోజులుగా బాలలకు వేసవి వినోదం-శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ ఈ శిబిరంలో పిల్లలకు యోగా, చదరంగం, కంప్యూటర్ శిక్షణ, మేజిక్, డ్రాయింగ్, గణితం, ఓరిగామి, వ్యక్తిత్వ వికాశం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సెల్‌ఫోన్, టివి చూస్తూ కాలం గడపకుండా ఈ కార్యక్రమాలు తోడ్పాడతాయన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో తణుకు ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మోమెంటోలతో చిరు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ టీచర్ కోట రాంప్రసాద్ మోటివేషన్ స్పీచ్ ఇవ్వగా, గోపి మావ మాజిక్ షోతో అలరించారు. దుర్గప్రసాద్ చిత్రలేఖన ప్రదర్శన చేయగా, రాజు మాస్టర్ ఓరిగామి నేర్పించారు. విజ్ఞాన కేంద్రం సభ్యులు పిఎల్ నరసింహారావు మాట్లాడుతూ శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం నిర్వహించే మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, ఉచిత న్యాయ సహాయాలను వినియోగించుకోవాలని కోరారు. బాలోత్సవం కోశాధికారి ఎఎస్‌వి శేషుబాబు, సభ్యులు యర్రా రాజ్యలక్ష్మి, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, రాజు, 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సమక్షంలో మంత్రి నిమ్మల పుట్టినరోజు

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పుట్టినరోజు వేడుక మంగళవారం జరిగింది. రామానాయుడు 2014 నుంచి పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉంటున్నారు. ఈ విషయం తెలిసి సిఎం రామానాయుడును తన ఛాంబర్‌కు పిలిపించి సింపుల్‌గా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టుపాటి రవికుమార్ సమక్షంలో కేక్‌కట్ చేయించారు.

మావుళ్లమ్మకు 11 గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మవారికి తాడేపల్లిగూడేనికి చెందిన కె.లోవ వెంకట అప్పారావు, లక్ష్మీ మాధురి దంపతులు (అక్షయ జ్యుయలర్స్ వారు) మంగళవారం 11 గ్రాముల బంగారం విరాళంగా ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


తాడేపల్లిగూడెం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సోమరాజు

ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాధపురంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ఉపాధి పని ప్రదేశంలో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ చాలా కాలం క్రితం ఇచ్చిన పనిముట్లు తప్ప ఈ మధ్యకాలంలో పనిముట్లు, టెంట్లు గానీ ఇవ్వలేదని, గతంలో ఇచ్చిన మాదిరిగా సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని తెలిపారు. దీనిపై సోమరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉపాధి హామీని సక్రమంగా అమల చేయడం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సి, కూలీలకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పీలగాది నాయుడు, జి.వెంకటేశ్వరరావు, కోనవరపు నాగభూషణం, కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు.

తణుకు రూరల్ : వ్యవసాయంలో ప్రభుత్వం యాంత్రీకరణ వినియోగానికి అధిక ప్రాధాన్యతివ్వడం కూలీల నోట్లో మట్టి కొట్టడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయక కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. దువ్వలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధిక యాంత్రీకరణ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వడం కారణంగా కూలీలు పని దినాలు కోల్పోతారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూలీల అందరిపైనా ఉంఆదని తెలిపారు. ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో పాటు జరుగుతున్న గ్రామీణ బంద్‌లో కూలీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దొంగల నాగేశ్వరరావు, బండారు వెంకటేశ్వరరావు, రేలంగి చిన శ్రీను, కారంకి సావిత్రి, దొంగల పద్మ, మారం సూర్యనారాయణ, తిరుగురెడ్డి రామలక్ష్మి, కడియం సుబ్రహ్మణ్యం, బొక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువతులు పౌష్టికాహారం తీసుకోవాలి

గణపవరం:యుక్త వయస్సు ఆడ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చని పిహెచ్‌సి పి.కిరణ్మయి చెప్పారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశాడే నెలవారీ సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలకు 21 ఏళ్లకు మగపిల్లలకు 25 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. ప్రతి ఆశా వద్దా ప్రెగ్నెన్సీ కిట్లు కనీసం 10 ఉండాలన్నారు. ఎన్‌సిడి సిడి సర్వే ఈ నెలాఖరులోపు స్క్రీనింగ్ పూర్తిచేయాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు పెంచడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆశాలకు రెండు యూనిఫారం చీరలు అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, సిహెచ్ సత్యవతి, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి వద్ద ఆశా డే సందర్భంగా డాక్టర్ ఎం.నవ్యజీవన ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనారోగ్య సమస్యలపై డాక్టర్ నవ్య జీవన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అభినందన

తాడేపల్లిగూడెం:పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గురుకుల విద్యార్థులను ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మంగళవారం స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రయివేటు స్కూళ్లకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. 76 మంది విద్యార్థులకు 73 మంది ఉత్తీర్ణత సాధించి 500 పైగా మార్కులు తెచ్చుకున్న 25 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రాజారావు, ఉపాధ్యాయులు యాండ్రపాటి.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి : సిపిఎం

పోడూరు:ధాన్యం కొనుగోలులో కౌలు రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, గోనె సంచుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు, పిల్లి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడూరులోని పలు ప్రాంతాల్లో మంగళవారం రైతు పొలాల్లో పర్యటించి కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోందన్నారు. 126 రకం ధాన్యం కొనుగోలులో మిల్లర్లు వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. రైతు భరోసా సిబ్బంది తేమశాతం నిర్ధారణా రశీదులు ఇవ్వడం లేదని, దీంతో ధాన్యం పట్టే మధ్యవర్తులు తిరిగి తేమశాతం వేసి వాళ్ల దగ్గర వచ్చిందే ఫైనల్ అని మిల్లర్లకు డబ్బులు కట్టిస్తున్నారని తెలిపారు. ధాన్యం మిల్లులకు వెళ్లాక తరుగు, నూకశాతం పేరుతో వేల రూపాయలు కట్టించుకుంటున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి వెంటనే గోనె సంచుల కొరత లేకుండా చేసి, అన్నిరకాల ధాన్యాలనూ వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అన్నదాత దిగాలు..!

అకాల వర్షంతో అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం


వరి మోపులు మోస్తున్న కూలీలు

ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు దిగుబడులు చేతికందే వేళ అకాల వర్షం, ఈదురుగాలులు కంటిమీద కునుకులేకుండా చేశాయి. దాళ్వా కోతలు ఊపందుకోవడంతో ఏ గ్రామానికి వెళ్లినా కల్లాల్లో, రోడ్లపై ధాన్యం ఆరబోసి, పంట నెలకొరిగి, నీళ్లలో వరిచేలు ఉన్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. తేమ శాతం తగ్గిన తరువాత మిల్లులకు తరలిస్తామని భావించిన రైతులు ఆదివారం ఒక్కసారిగా భారీ వర్షంతో పంటను రక్షించుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. సీతారామపురం, రుస్తుంబాద, యర్రంశెట్టి వారి పాలెం, లక్ష్మణేశ్వరం తదితర గ్రామాల్లో రోడ్లపైనే రైతులు ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఎల్‌బి.చర్ల, మోడీ గ్రామాల్లో దర్భరేవు డ్రెయిన్‌లో నీరు లాగకపోవడంతో కోత కోసిన చేల్లో మోకాల్లోతు నీటిలోనే రైతులు పనులు చేయించుకుంటున్నారు. చేల్లో మురుగు నీరు లాగే పరిస్థితి లేకపోవడంతో కోత మిషన్లు తిరగక కూలీలపైనే ఆధారపడిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

ఆసుపత్రుల్లో వృద్ధులకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీతాబాయి సూచించారు. వయసు రీత్యా వారు వచ్చిన వెంటనే వైద్య సహాయం అందించి ముందే పంపించాలని తెలిపారు. స్థానిక లయన్స్ హాల్లో సోమవారం సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ కె.జానకమ్మ సంస్మరణార్థం వృద్ధుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు లయన్స్ అంతర్జాతీయ సభ్యులు, వృద్ధుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఎంవి.సూర్యనారాయణరావు అధ్యక్షత వహించారు. సదస్సులో జిల్లా వైద్యాధికారి గీతాభాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వృద్ధులకు ముందు అవకాశం ఇవ్వాలని, వైద్యులకు అధికారులకు చాలా స్పష్టంగా తెలియజేశామని చెప్పారు. వృద్ధుల, వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ మాట్లాడుతూ వృద్ధులు గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య సంఘం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. స్థానిక వైద్యులు డాక్టర్ ప్రతాప్ కుమార్, డాక్టర్ కవిత, డాక్టర్ మాధవి, డాక్టర్ బిలాల్ పాల్గొన్నారు. అనంతరం సుమారు 100 మంది వృద్ధులకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కాళ్ల

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడం కోసం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర అన్నారు. సీసలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు ఈ క్యాంపు ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, క్రాఫ్ట్ వంటి రకరకాల కళలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధానోపాధ్యాయులు అడ్డాల వెంకట సుబ్బరాజు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ పాఠశాలలు తిరిగి పున:ప్రారంభించే వరకూ జరుగుతుందని ఈ కార్యక్రమానికి అనూష వాలంటీర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ శిబిరం ఉపాధ్యాయులు బి.రాజమౌళి కోటేశ్వరస్వామి పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఎస్ఎంసి ఛైర్మన్ తెనాలి అశోక్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం: నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం పిల్లలకు కథలు చెప్పడం, చదివించడం చేశారు. రిసోర్స్ పర్సన్ సిఆర్‌పి కృపారావు పాల్గొని గుడ్ హ్యాండ్ రైటింగ్‌లో మెలకువలు, పద్యాలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. వైఎన్ కాలేజ్ హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ చినమిల్లి శ్రీనివాస్ గ్రంథాలయం ప్రాముఖ్యత, పుస్తక సంపద, సభ్యత్వాల నమోదు గురించి వివరించారు. శాస్త్రవేత్త సుబ్బారావు సైన్స్ క్లాస్, జీమూత వాహనుడు కథను వివరించారు .

పెనుమంట్ర : గ్రంథాలయాలు మతాలతో సంబంధం లేని ఆధునిక దేవాలయాలని విశ్రాంత తహశీల్దార్ చీర్ల సూర్య నారాయణరెడ్డి అన్నారు. మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిత్రకారులు ఎల్‌వి.సూర్యనారాయణ మూర్తితో ఆయన పుస్తక పఠనంపై వివరించారు. శిబిరంలో కె.తనీషా, కె.జస్మిత, ఎం.గీతిక, సిహెచ్.జయశ్రీ, డి.హేమ నందిని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం


మొగల్తూరు: నిరసన ప్రదర్శన చేస్తున్న ఆశా వర్కర్లు

ఆశాలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్‌బి.చర్ల, తూర్పుతాళ్లు పిహెచ్‌సిల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆశాలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని, ఒప్పంద జీఓలు విడుదల చేయాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని తెలిపారు. ఆశాల నియమాకాలు ప్రభుత్వమే చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ల సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పి.రత్నకుమారి, కె.వెంకటేశ్వర్లు, ఎం.సునీత, బి.పద్మ, సిహెచ్ నాగలక్ష్మి, ఎం.రత్న కుమారి, పి.మరియమ్మ పాల్గొన్నారు.

మొగల్తూరు : ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం మొగల్తూరులోని పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోర్టులను రద్దు చేసే కార్మిక చట్టాలను పటిష్ట పర్చాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్చి ఒప్పంద జిఓను వెంటనే అమలు చేయాలన్నారు అనంతరం వినతిపత్రాన్ని ఆరోగ్య సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో కె.సత్యవతి, పి.రేవతి, ఎంసిహెచ్.సరోజినీ, ఎ.కోమలి, కె.భవాని, వెంకటరమణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాసరావు కోరారు. హెల్త్ సెంటర్ వద్ద బుధవారం ఆశాలతో ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. 20న జరిగే సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సాంకేతిక పద్ధతులతో ఆక్వాసాగు చేపట్టాలి

ప్రజాశక్తి - ఉండి

సాంకేతిక పద్ధతులను అనుసరించి ఆక్వా సాగు చేపట్టడం వల్ల తక్కువ పెట్టుబడిలో అధిక దిగుబడి సాధించొచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర ఫిషరీస్ ఒఎస్‌డి టి.సుగుణ అన్నారు. మంగళవారం ఎన్ఆర్‌పి అగ్రహారంలోని మత్స్య పరిశోధనా కేంద్రంలో ఎఫ్‌డిఒ రాంబాబు ఆధ్వర్యంలో ఆక్వా సాగులో సాంకేతిక అనుకరణాలు, తాగునీటి యాజమాన్య పద్ధతులపై ఆక్వా రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ చదలవాడ నాగరాణి, టి.సుగుణ, జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి.నాగలింగాచారి మాట్లాడారు. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా ఆంక్షలు విధించడం పట్ల ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భీమవరం, ఉండి, పాలకోడేరు, గణపవరం ఆకివీడు, కాళ్ల మండలాల్లోని సాంప్రదాయ పద్ధతుల్లో ఆక్వా సాగు చేపట్టే ఆక్వా రైతులకు సాంకేతిక పద్ధతుల్లో సాగు ఏ విధంగా చేయాలనే దానిపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆక్వా సాగులో రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లా నెంబర్ వన్‌గా ఉందన్నారు. ఆక్వా రైతులకు ఏ అవసరం ఉన్న తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ ఆనంద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ కె.ఫణిప్రసాద్, మత్స్య పరిశోధన కేంద్రం ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు సహకరిస్తాం : ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఎల్ఎ

రాబోయే రోజుల్లో తణుకు నియోజకవర్గం క్రీడల నిర్వహణకు వేదికగా నిలిపేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో ఎంఎల్ఎ రాధాకృష్ణ పాల్గొని బహుమతులు అందజేసి మాట్లాడారు. గతంలో క్రీడాకారులు ఎన్ని పతకాలు సాధించినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి నానా అవస్థలు పడేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో దేశ విదేశాల్లో ఎక్కడ పథకాలు సాధించినప్పటికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యత ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ ఆర్థిక సహకారంతో మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన విజేతకు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన విజేతకు రూ.7 వేలతో పాటు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నాగరాజుపేటలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

పాలకొల్లు :పాలకొల్లు నాగరాజుపేటలో రూ.2.83 కోట్లతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ బుధవారం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి నిమ్మల రామానాయుడు కృషితో ఏర్పాటైన ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ తదితరులు పాల్గొంటారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వల్ల నాగరాజు పేటతోపాటు శాంతినగర్, గౌతమీనగర్, బ్రాడీపేట, సాయి మనోజ్ నగర్, కోడిగట్టు, జిన్నూరు, ఉల్లంపర్రు తదితర ప్రాంతాలకు లోవోల్టేజీ సమస్య పరిష్కారం కానుంది. ఈ మేరకు మంత్రి రామానాయుడుకు ఆయా ప్రాంతాల ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - తణుకు

ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ ద్వారా వైద్య సదుపాయం పొందలేక సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న వారికి ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. స్థానిక కూటమి కార్యాలయంలో మంగళవారం తణుకు నియోజకవర్గంలో 21 మంది లబ్ధిదారులకు రూ.12.11 లక్షల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల బీమా సదుపాయం కల్పించి దాని ద్వారా వైద్య సదుపాయం పొందే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం పెన్షనర్స్ అసోసియేషన్ భవనం వద్ద సంఘం అధ్యక్షులు ఎం.మార్కండేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి ఎరియర్స్, పెండింగ్ డిఎలు, నేటి వరకూ ఉద్యోగ విరమణ చేసిన వారి గ్రాడ్యూటీ, పిఎఫ్ ఫైనల్ పేమెంట్స్, లీవు పేమెంట్ వెంటనే చెల్లించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పెన్షనర్లకు ఇహెచ్‌ఎస్ అవకాశముంది కానీ రీయింబర్స్ మెంట్ అవకాశం లేదని ఆ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. ట్రెజరర్ స్వామినాయుడు, ఉపాధ్యక్షులు ఎంబివి జాకబ్, ఆర్.శ్రీరామకృష్ణ, సిహెచ్ విర్‌కె.సాగర్, కెఎకెవివి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 17 మంది ఎంపిక

పాలకొల్లు :స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సౌజన్యంతో సంధ్యా మెరైన్స్‌చే నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 17 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ కారుమూరి నరసింహారావు తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు వివిధ ప్రాంతాల నుండి 48 మంది అభ్యర్థులు హాజరయ్యారని, వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాల ఛైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటివరకూ 90 శాతం ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. కళాశాల సెక్రటరీ కెవి సీతారామరాజు మాట్లాడారు. కళాశాల ట్రెజరర్ ఆర్.ప్రవీణ్ భాను, అకడమిక్ అడ్వయిజర్స్ ఎబిఎస్.మూర్తి, ఎన్.సీతారామారావు, రాష్ట్ర నైపుణ్యత అభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.